సాక్షి ప్రకాశం

ఆదివారం । 31 । డిసెంబర్ । 2023



చిన్నారుల మేధకు సలాం

రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో జిల్లా విద్యార్థులు సత్తాచాటడంతో దక్షిణ భారత స్థాయి పోటీలకు జిల్లా ప్రాజెక్టులు మూడు ఎంపికయ్యాయి. - 8లో..



గిరిజన గూడేల్లో పర్యటన

కేంద్ర గిరిజన సంక్షేమశాఖ అధికారుల బృందం శనివారం పెద్దదోర్నాల మండల పరిధిలోని గిరిజనగూడేల్లో పర్యటించింది. ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంది. - 8లో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 30 /20

ఉదయం పొగ మంచు ఎక్కువగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జెడ్పీలో 18 మందికి పదోన్నతులు



పదోన్నతి పొందిన వారికి పత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు సిటీ: జిల్లా పరిషత్ (జెడ్పీ)లో 18 మంది పదోన్నతి పొందగా, చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ శనివారం కార్యాలయంలో సంబంధిత పత్రాలను వారికి అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ జెడ్పీలో పనిచేస్తున్న ఆఫీస్ సబార్డినేట్లు 13 మంది రికార్డు అసిస్టెంట్లుగా పదోన్నతి పొందినట్లు తెలిపారు. అలాగే, రికార్డు అసిస్టెంట్లు ఐదుగురు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జైళ్ల శాఖ డీఐజీ



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న డీఐజీ

ఒంగోలు అర్బన్: జిల్లా ఉప కారాగారం వార్షిక తనిఖీల్లో భాగంగా ఒంగోలు వచ్చిన జైళ్ల శాఖ గుంటూరు రేంజ్ ఉపశాఖాధికారి (డీఐజీ) ఎం.వరప్రసాద్ శనివారం ప్రకాశం భవనంలో కలెక్టర్ దినేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిద్దలూరు, యర్రగొండపాలెంలోని జైళ్ల శాఖకు సంబంధించి స్థలాల విస్తరణ, భూమి పరివర్తన చేయడంపై కలెక్టర్‌తో చర్చించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం జిల్లా ఉపకారాగారానికి వెళ్లి సంబంధిత రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి పలు సలహాలు, సూచనలను వరప్రసాద్ చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా కారాగార పర్యవేక్షణ అధికారి వరుణారెడ్డి, ఉపకారాగారముల అధికారి వెంకటరెడ్డి, రమేష్, జైలర్ నూకా శ్రీనివాసరావు, డిప్యూటీ జైలర్లు ఉన్నారు.

పీఎం ఆదర్శ యోజన పనులను వేగవంతం చేయాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం కింద ఫేజ్–1లో ఎంపిక చేసిన 35 గ్రామాల్లో 481 పనులను గుర్తించడం జరిగిందని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఆ పథకంపై సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ శాఖాధికారులతో శనివారం ప్రకాశం భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పథకంలో భాగంగా గ్యాప్ ఫిల్లింగ్ ఫండ్‌తో క్రోడీకరించిన 242 పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్యాప్ ఫిల్లింగ్ ఫండ్‌తో చేయాల్సిన పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం చేయరాదన్నారు. జనవరి నెలకల్లా పూర్తి చేసి నిధుల విడుదల కోసం జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయానికి నివేదికలు అందజేయాలన్నారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖాధికారి లక్ష్మానాయక్, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ్య, డ్వామా పీడీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సోమవారం స్పందన రద్దు

ఒంగోలు అర్బన్: స్థానిక ప్రకాశం భవనంలో కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని జనవరి 1వ తేదీ నూతన సంవత్సరం సందర్భంగా తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు స్పందన విభాగం సూపరింటెండెంట్ డి.నాగజ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నాడు అధికారాన్ని అడ్డంపెట్టుకుని టిడ్కో ఇళ్ల పేరుతో పేదలను దోచుకున్న టీడీపీ నేతలు.. నేడు ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ డ్రామాలు మొదలుపెట్టారు. నగరంలో ఆరు వేల ఇళ్లకు పది వేల మంది దగ్గర నిస్సిగ్గుగా డబ్బు వసూలు చేసిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్.. ఇప్పుడు అదే ఇళ్ల పేరుతో ఛీప్ ట్రిక్స్‌కు తెరతీశారు. నాటి టీడీపీ ప్రభుత్వం అరకొరగా ఇళ్లు నిర్మించి వదిలేస్తే.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు రూ.350 కోట్లు ఖర్చు చేసింది. వాస్తవాలను తప్పుదోవ పట్టించే విధంగా దామచర్ల ఆందోళన చేస్తూ మొసలికన్నీరు కార్చడం విడ్డూరంగా ఉందని జిల్లా వాసులు ఈసడించుకుంటున్నారు.



కొప్పోలు రోడ్డులో టిడ్కో ఇళ్లు

జనార్దన్ ఛీప్ ట్రిక్స్..!

- టిడ్కో ఇళ్ల దగ్గర ధర్నా చేసే అర్హత ఉందా..?
- ఆరు వేల ఇళ్లకు పది వేల మంది దగ్గర డబ్బు వసూలు
- టిడ్కో ఇళ్ల కాంట్రాక్టర్లకు రూ.కోట్ల బకాయిలు
- కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో తూతూమంత్రంగా పనులు
- టిడ్కో ఇళ్లలో 30 శాతం కూడా పూర్తి చేయని టీడీపీ ప్రభుత్వం
- 2019 ఎన్నికల వేళ చంద్రబాబు డూప్ షో
- జిల్లాలో టిడ్కో ఇళ్ల నిర్మాణంతో పాటు మౌలిక వసతులకు రూ.350 కోట్లు కేటాయించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉచితంగా 6,112 ఇళ్లు మంజూరు



టిడ్కో ఇళ్ల వద్ద అవాస్తవాలను ప్రచారం చేస్తున్న దామచర్ల జనార్దన్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఒంగోలు నగరంతో పాటు జిల్లాలోని ఇతర పట్టణాల్లో టిడ్కో ఇళ్ల పేరుతో గత టీడీపీ ప్రభుత్వం మాయాజాలం చేసింది. పేదలకు ఇళ్ల నిర్మాణాలను తమ ప్రభుత్వమే చేపడుతుందని చంద్రబాబు నాయుడు గొప్పలు చెప్పారు. 2019 సాధారణ ఎన్నికలు వచ్చేంత వరకూ ఆంధ్రప్రదేశ్ పట్టణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టిడ్కో) ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నట్లు నటిస్తూ వచ్చింది. చివరకు కేంద్ర ప్రభుత్వం తన వాటాగా ఇచ్చిన డబ్బును మాత్రమే ఖర్చుచేసి రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్లు నిర్మిస్తోందని పచ్చ మీడియా ద్వారా ఊదరగొట్టించుకుంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో నిర్మించతలపెట్టిన 9,568 టిడ్కో గృహాలకు సంబంధించి మొత్తం రూ.482 కోట్లు వ్యయం అవుతుందని అంచనాలు రూపొందించారు. అయితే, కేవలం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.145.32 కోట్లు మాత్రమే వెచ్చించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి చిల్లి గవ్వ కూడా ఖర్చుపెట్టకుండా మసిపూసి మారేడు కాయ చేసింది. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం టిడ్కో ఇళ్లను దాదాపు పూర్తి చేశామని ప్రగల్భాలు పలికారు. ఇప్పటికీ పచ్చ మీడియాలో రాయిస్తూ లబ్ధిదారులను మభ్యపెట్టే కుట్రకు తెరతీస్తూనే ఉన్నారు.

ఒంగోలులో 10 వేల మంది వద్ద డబ్బు వసూలు...

టిడ్కో ఇళ్ల నిర్మాణం పేరుతో ఒంగోలు నగరంలోని ఇళ్లు లేని నిరుపేదలు దాదాపు 10 వేల మంది వద్ద డబ్బు వసూలు చేశారు. ఇళ్ల నిర్మాణాలను మూడు భాగాలుగా విభజించి డబ్బు కట్టించుకున్నారు. కానీ, కేవలం 6 వేల మందిని మాత్రమే ఎంపిక చేశారు. మిగతా వాళ్లకు కట్టిన డబ్బు తిరిగివ్వకుండా నిట్టనిలువునా మోసం చేశారు. స్థానిక చింతల వద్ద 1,488 ఇళ్లు, కొప్పోలు వద్ద 4,512 ఇళ్లు నిర్మించాలని తలచారు. పని జరిగిన మొత్తం విలువ రూ.112.50 కోట్లు అయితే.. కాంట్రాక్టర్‌కు మాత్రం కేవలం రూ.51.62 కోట్లు చెల్లించారు. మిగతా రూ.60.88 కోట్లు చంద్రబాబు బకాయిలు పెట్టి వెళ్లిపోయారు. దీంతో కాంట్రాక్టర్లు మిగతా పనులు చేయకుండా నిలిపివేశారు. మిగిలిన నాలుగు వేల మంది డబ్బుల గురించి చెప్పకుండా జనార్దన్ ధర్నాల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని మోసపోయిన లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 9,568 మంది లబ్ధిదారుల ఎంపిక...

గత టీడీపీ ప్రభుత్వం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మొత్తం 9,568 మంది లబ్ధిదారులను ఎంపిక చేసింది. ఒంగోలు నగరంతో పాటు కందుకూరు, మార్కాపురం, గిద్దలూరు, అద్దంకి, కనిగిరి మున్సిపాలిటీల్లో టిడ్కో ఇళ్లు నిర్మించాలని భావించారు. వాటిలో ఒంగోలు నగరంలో చింతల, కొప్పోలులో కలిపి 6 వేల గృహాలు నిర్మించాలని స్థలాల ఎంపిక కార్యక్రమాన్ని పూర్తి చేశారు. మార్కాపురంలోని పెద్దనాగులాపురం రోడ్డులో 912 మందికి, గిద్దలూరు మోడెంపల్లిలో 1,248 మందికి, కనిగిరి చాకిరాలలో 912 మందికి, అద్దంకి శింగరకొండలో 960 మందికి, కందుకూరు ఉప్పుచెరువు వద్ద 1,408 మందికి టిడ్కో గృహాలు నిర్మించి ఇవ్వాలని ఏర్పాట్లు చేసింది. మొత్తం ప్రాజెక్టుకు రూ.482 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేయగా, కేంద్రం ఇచ్చిన రూ.145 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. కేవలం 30 శాతం నిర్మాణాలు కూడా పూర్తి చేయలేదు.

రూ.350 కోట్లు కేటాయించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం...

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఏమీ ఖర్చు చేయకుండానే ప్రచార ఆర్భాటాలు చేసుకుని కాలం గడిపితే.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన కోసం రూ.350 కోట్లు కేటాయించింది. ఇప్పటికే రివర్స్ టెండర్ల ద్వారా ఒంగోలు, గిద్దలూరు, కనిగిరి, మార్కాపురంలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్ల ప్రక్రియ పూర్తి చేసింది. మొదటి విడతగా 2,640 గృహాలకు రివర్స్ టెండర్‌లో 11 శాతం లెస్‌కు టెండర్లు పూర్తయినందువలన రాష్ట్ర ప్రభుత్వానికి రూ.23.34 కోట్ల ఆదాయం సమకూరింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను మాత్రమే ఖర్చు చేసిన చంద్రబాబునాయుడు తన పాలన సమయంలో రాష్ట్ర ప్రభుత్వం నిధులు కనీసం వెచ్చించకుండానే అధికారాన్ని కోల్పోయి, ఇప్పుడేమో టిడ్కో ఇళ్లు మొత్తం తానే నిర్మించినట్లు ప్రగల్భాలు పలకడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ప్రజలు ఈసడించుకుంటున్నారు.

6,112 గృహాలను ఉచితంగా...

ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రజా సంకల్ప యాత్రలో 300 చదరపు గజాల టిడ్కో ఇంటిని ఉచితంగా ఇస్తానని హామీ ఇచ్చారు. దీంతో జిల్లాలో మొత్తం ఈ తరహా లబ్ధిదారులు దాదాపు 6,112 మంది ఉన్నారు. అంటే ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 9,568 గృహాల్లో 6,112 మందికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉచితంగా ఇళ్లు ఇస్తుందన్నమాట. దీంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వంపై రూ.130 కోట్ల భారం పడుతోంది. అయినా ఇచ్చిన మాట కోసం లబ్ధిదారులకు ప్రభుత్వమే 300 చదరపు గజాల ఇంటి నిర్మాణాన్ని పూర్తిగా చేపట్టి అందించనుంది. అంటే ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.6.55 లక్షలు వెచ్చించి నిర్మాణాన్ని చేపట్టి పూర్తి చేయనుంది.

టిడ్కో ఇళ్లను పరిశీలించిన మేయర్



టిడ్కో ఇళ్లకు వాడుతున్న మెటీరియల్‌ను పరిశీలిస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: స్థానిక కొప్పోలులోని పోతురాజుకాలువ సమీపంలో నిర్మాణంలో ఉన్న టిడ్కో ఇళ్లను ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత శనివారం పరిశీలించారు. పలువురు కార్పొరేటర్లతో కలిసి నిర్మాణం పూర్తి కావస్తున్న టిడ్కో ఇళ్ల తీరును పర్యవేక్షించారు. నిర్మాణానికి వాడుతున్న మెటీరియల్‌ను పరిశీలించారు. అక్కడున్న టిడ్కో అధికారులను నిర్మాణాలకు సంబంధించిన వివరాలడిగి తెలుసుకున్నారు. టిడ్కో గృహాల సముదాయంలో కల్పిస్తున్న మౌలిక వసతుల గురించి కూడా అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, కరెంటు, డ్రైనేజీ సౌకర్యాలను పరిశీలించారు. గృహాలు నెలలో పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తారని మేయర్ వివరించారు. మేయర్ వెంట పలువురు కార్పొరేటర్లతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కోవిడ్‌ను నిర్లక్ష్యం చేయవద్దు

● డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి



డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి

ఒంగోలు టౌన్: పండుగల రోజుల నేపథ్యంలో ప్రజలు కోవిడ్‌పై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్. రాజ్యలక్ష్మి సూచించారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో పలు సలహాలు, సూచనలు చేశారు. దేవాలయాలు, మసీదులు, చర్చిల్లో భక్తులు సామూహికంగా ప్రార్థనలు చేస్తుంటారని, ప్రతిఒక్కరూ తప్పనిసరిగా మాస్క్ ధరించాలని చెప్పారు. బస్సు, రైళ్లలో ప్రయాణాలు చేస్తున్న సమయంలో కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరికైనా దగ్గు, జ్వరం, ఆయాసం తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రాథమిక వైద్యశాలకు వెళ్లి వైద్యుడిని సంప్రదించాలని చెప్పారు. తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. కోవిడ్‌ను అశ్రద్ధ చేయవద్దని హెచ్చరించారు.

ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలి


● కలెక్టర్ దినేష్‌కుమార్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్, జేసీ

ఒంగోలు అర్బన్: రాబోయే సాధారణ ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల నిర్వహణపై స్థానిక ప్రకాశం భవనంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ సిబ్బందికి అవసరమైన ఫర్నిచర్, పోలింగ్ గదితో పాటు ఓటర్లు వరుసలో నిలబడే ప్రాంగణంలో విద్యుత్ సౌకర్యం, తాగునీరు, మరుగుదొడ్లు, వికలాంగుల కోసం ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు వినియోగిస్తున్న భవనాల్లో పాఠశాలలు, కళాశాలలు, వ్యవసాయ, జిల్లా పరిషత్, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్, పంచాయతీరాజ్, బీసీ సంక్షేమ శాఖలకు చెందినవి ఉండటం వల్ల సెక్టార్ ఆఫీసర్లతో పాటు సంబంధిత శాఖల అధికారులు కూడా తనిఖీలు చేసి నివేదిక అందజేయాలన్నారు. అవసరమైన చోట శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేసేందుకు బడ్జెట్ అంచనాలను నివేదికలో పొందుపరచాలన్నారు. బడ్జెట్ ప్రతిపాదనలపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి జనవరి 3వ తేదీలోపు లేఖ పంపుతారని తెలిపారు. సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్‌ఓ శ్రీలత, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, మార్కెటింగ్ ఏడీ ఉపేంద్ర, డీఈఓ సుబ్బారావు, ఆర్‌ఐఓ సైమన్ విక్టర్, ఐసీడీఎస్ పీడీ మాధురి, గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, బీసీ సంక్షేమ అధికారి అంజల, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, పశుసంవర్థక, పంచాయతీరాజ్, ఆటవీ శాఖాధికారులు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న నిర్వాహకులు

దర్శి: దర్శి జూనియర్ కాలేజీ, హైస్కూల్ ప్రాంగణంలో జనవరి 5, 6, 7 తేదీల్లో సాయంత్రం 6 గంటల నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శీలం శ్రీనివాసరెడ్డి, గర్నెపూడి స్టీవెన్ తెలిపారు. సంబంధిత వాల్‌పోస్టర్లను శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విడుదల చేశారు. ఫ్లడ్‌లైట్ల వెలుగులో నిర్వహించే ఈ పోటీలు స్త్రీలు, పురుషులకు విడివిడిగా జరుగుతాయని తెలిపారు. బహుమతులు కూడా ఇద్దరికీ విడివిడిగా ఇవ్వడం జరుగుతుందన్నారు. మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.75 వేలు, మూడో బహుమతి రూ.50 వేలు, నాలుగో బహుమతి రూ.40 వేలని తెలిపారు. వివరాలకు 77991 80236, 79818 51117, 81439 42073 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వివాహిత హత్య

- ఒంగోలు రాజీవ్ గృహకల్ప కాలనీలో ఘటన
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



పరిశీలిస్తున్న సీఐ భక్తవత్సలరెడ్డి

ఒంగోలు సబర్బన్: నగరంలోని కొప్పోలు రోడ్డులో గల రాజీవ్ గృహకల్ప కాలనీలో వివాహిత హత్యకు గురైంది. సేకరించిన వివరాల మేరకు... కర్నూలు జిల్లాకు చెందిన కొండపల్లి గౌరీ (34) బేల్దారి పనులు చేసుకుంటూ జీవిస్తోంది. ఆమెకు ముగ్గురు కుమార్తెలు. భర్త వెంకటరెడ్డి చనిపోగా, కర్నూలు జిల్లాకే చెందిన మహేశ్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. శుక్రవారం రాత్రి మహేశ్ గౌరీ ఇంటికి వచ్చాడు. ఏమైందో ఏమోగానీ తెల్లవారేసరికి గౌరీ విగతజీవిగా బెడ్‌రూమ్‌లో మంచంపై పడి ఉంది. మహేశ్ వెళుతూ ఇంటి బయట తాళం వేశాడు. తెల్లవారి నిద్రలేచిన చిన్నకుమార్తె తల్లివద్దకు వెళ్లి నిద్రలేపగా, చలనం లేకపోయేసరికి గట్టిగా కేకలు వేసింది. చుట్టుపక్కల వాళ్లు తాళం పగులకొట్టి లోనికి ప్రవేశించారు. గౌరీ చనిపోయిందని నిర్ధారించుకుని ఒంగోలు తాలూకా పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఒంగోలు డీఎస్పీ వీ నారాయణస్వామిరెడ్డి, సీఐ భక్తవత్సలరెడ్డి ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు మృతదేహాన్ని తరలించారు. హత్యా నేరం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు సీఐ భక్తవత్సలరెడ్డి తెలిపారు. గతంలో తండ్రినీ, ఇప్పుడు తల్లినీ కోల్పోవడంతో ఆ ముగ్గురు ఆడపిల్లలు అనాథలుగా మారారు.

క్లుప్తంగా

వృద్ధురాలిపై లైంగికదాడి

మార్కాపురం రూరల్: మండలంలోని రాయవరం గ్రామ పరిధిలోని రైల్వేస్టేషన్ సమీపంలో గల వడ్డెర కాలనీలో వృద్ధురాలిపై యువకుడు లైంగిక దాడి చేసిన సంఘటన శనివారం వెలుగులోనికి వచ్చింది. రూరల్ ఎస్సై వెంకటేశ్వర నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 60 సంవత్సరాల వయస్సు కలిగిన ఒంటరి వృద్ధ మహిళ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన దేవుండ్ల కమల్నాథ్ మద్యం మత్తులో లైంగికదాడి చేసినట్లు తెలిపారు. అత్యాచారానికి గురైన మహిళ స్థానిక జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కమల్నాథ్‌ను అరెస్టు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

114 మద్యం బాటిళ్ల స్వాధీనం

పీసీపల్లి: రాబోయే జనరల్ ఎలక్షన్ సందర్భంగా మండలంలో మద్యం అక్రమ నిల్వలు ఉండకుండా చూసేందుకు ఎస్ఈబీ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో మర్రిపూడి మండలం వేమవరం గ్రామానికి చెందిన బొల్లా మహేష్ అనే యువకుడు తన స్నేహితునితో కలిసి 114 మద్యం సీసాలను గ్రామర్ బైక్ తీసుకెళ్తుండగా ఎస్ఈబీ పోలీసులు పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. మద్యం సీసాలను పీసీపల్లి జీఆర్‌ఓ దుకాణం నుంచి రూ.10ను అదనంగా చెల్లించి తీసుకొస్తున్నట్లు తెలిపారు. దీంతో వారిద్దరినీ అరెస్టు చేసి కోర్టుకు తరలించి, బైక్‌ను సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో సెబ్ సీఐ షేక్ ఎండీ అబ్దుల్ జలీల్, ఎస్సై కె. వెంకటేశ్వరరావు, సిబ్బంది వి. శేషయ్య, డి. సుమంత్, నాగేశ్వరరావు, హెచ్‌సీ రంగనాయకులున్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

ముండ్లమూరు: మండలంలోని చంద్రగిరిలో ప్రమాదవశాత్తు పొగాకు బ్యారన్ దగ్ధం కావడంతో సుమారు ఐదు లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు నవులూరి సురేంద్ర మోహనరావు ఆవేదన వ్యక్తం చేశారు. విఠలాపురం గ్రామానికి చెందిన నవులూరి సురేంద్రమోహనరావు చంద్రగిరి గ్రామానికి చెందిన గంగిరెడ్డి పెద కొండగురవారెడ్డి బ్యారన్‌ను అద్దెకు తీసుకొని సాగు చేస్తున్నాడు. శనివారం అకస్మాత్తుగా బ్యారన్‌లో నుంచి పొగలు వస్తుండగా గమనించగా టైరు విరిగి పొయ్యిపై పొగాకు కర్ర పడడంతో మంటలు చెలరేగాయి. స్థానికులు ఫోన్ చేయగా అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపుచేసే ప్రయత్నం చేశారు. ఈ ప్రమాదంలో రెండు లక్షల విలువ చేసే ఏడు క్వింటాళ్ల పొగాకు, మూడు లక్షల విలువ చేసే బ్యారన్ సామాను ధ్వంసం అవడంతో ఐదు లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు.


పామూరు: రావిగుంటపల్లెలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పీడీ


గిద్దలూరు: ఖో ఖో ఆడుతున్న క్రీడాకారులు


మార్కాపురం: క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు


మార్కొండాపురంలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ఉత్సాహంగా..

సచివాలయాల స్థాయిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు హోరాహోరీగా నిర్వహిస్తున్నారు. శనివారం జిల్లాలోని అన్ని గ్రామాల్లో కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, ఖోఖో పోటీల్లో యువతీయువకులు, విద్యార్థులు ఉత్సాహంగా తలపడ్డారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

– సాక్షి నెట్‌వర్క్


దర్శి: షటిల్ ఆడుతున్న విద్యార్థులు


అల్లూరులో వాలీబాల్ ఆట ప్రారంభిస్తున్న ఎంపీడీవో సుజాత


రేగుమానిపల్లిలో వాలీబాల్ ఆడుతున్న యువత


మిర్రపేటలో టాస్ వేస్తున్న మురారి, సర్పంచులు, ఎంపీటీసీలు

ఉపాధ్యాయుడిని చితకబాదిన గ్రామస్తులు

- విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడంటూ ఆగ్రహం

మద్దిపాడు: విద్యార్థినులకు అసభ్యంగా మెసేజ్‌లు పెడుతూ ఒంటరిగా ఉన్న సమయంలో వారిపై చేతులు వేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఒక ఉపాధ్యాయుని గ్రామస్తులు చితకబాదారు. అనంతరం పాఠశాలకు రావద్దంటూ బయటకు నెట్టివేసిన ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. అందిన వివరాల ప్రకారం.. తెల్లబాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిగా పని చేస్తున్న ప్రసాద్ అనే ఉపాధ్యాయుడు పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తూ వారికి మెసేజ్‌లు పెడుతున్నాడని ఆ విద్యార్థినుల తల్లిదండ్రులు, బంధువులు ఆగ్రహించారు. శుక్రవారం సాయంత్రం పాఠశాల ముగిసే సమయంలో బయటకు వస్తున్న ఉపాధ్యాయుడు ప్రసాద్‌ను చితకబాది పాఠశాలకు రావద్దంటూ హెచ్చరించినట్లు విశ్వసనీయ సమాచారం. దీనిపై ఎవరూ ఉన్నతాధికారులకు గానీ పోలీసులకు గానీ ఫిర్యాదు చేయకుండా ఉండి పోయినట్లు తెలిసింది.

చిన్నారుల మేధకు సలాం!

- రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక పోటీల్లో విద్యార్థుల సత్తా
- దక్షిణ భారత స్థాయి పోటీలకు మూడు ప్రాజెక్టులు ఎంపిక
- డీఈవో అభినందనలు

ఒంగోలు: నిద్రమత్తులో నిత్యం అనేక ప్రమాదాలు చూస్తుంటా కన్నుమూత పడ్డ క్షణకాలంలో ప్రాణాలు ఉంటాయో లేదో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో డ్రైవర్‌ను అప్రమత్తం చేయడం ఎలా? విదేశాల నుంచి చమురును దిగుమతి చేసుకుంటూ ఉంటాం. ఇదంతా స్టీమర్ల ద్వారా దేశానికి చేరుకుంటుంది. కానీ పలు కారణాల వల్ల లక్షల కొద్దీ లీటర్ల చమురు సముద్రంలో కలిసిపోతుంది. అందుకే నీటిని, చమురును వేరుచేయడం ఎలా? బధిరులు పంటిద్వారా వినడం సాధ్యమే అని జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో చూపారు. వీటిపై మరింత పరిశోధన జరగాల్సి ఉన్నప్పటికీ చిన్నారులు రూపొందించిన ప్రాజెక్టులు ప్రతి ఒక్కరిని ఆలోచింపజేసేవిగా ఉన్నాయి. దీంతో కడపలో ఈనెల 28, 29 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో సత్తాచాటి దక్షిణ భారత స్థాయి పోటీలకు ఎంపికవడం విశేషం. ఈ సందర్భంగా సంబంధిత ప్రాజెక్టులను రూపొందించిన విద్యార్థులకు డీఈవో వీఎస్ సుబ్బారావు అభినందనలు తెలిపారు. ఈ చిన్నారులు జనవరి 27 నుంచి ఫిబ్రవరి 1 వరకు విజయవాడలోని మురళి రిసార్ట్స్‌లో నిర్వహించే దక్షిణ భారత స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనల్లో మరో మారు సత్తాచాటేందుకు సిద్ధం అవుతున్నారు.

డ్రైవర్ కన్నుమూస్తే అలారం అలర్ట్



రోడ్డు ప్రమాదాలకు కారణం ముఖ్యంగా నిర్లక్ష్యమే. ఇలా వాహన డ్రైవర్ వాహనాన్ని నడిపే సమయంలో నిద్రమత్తులో ఉన్నాడా లేదా అని పరిశీలించ దానికి కౌశిక్ ఒక పరికరాన్ని రూపొందించాడు. అదే అలారం అలర్ట్ (డ్రైవర్ యాంటీ స్లీప్ అలారం సిస్టం). వాహనం నడిపే డ్రైవర్ ఏమాత్రం కన్ను మూసినట్లు కనిపించినా వెంటనే అలారం మోగుతూ శబ్దం చేస్తుంది. వాహనంలో ఉన్నవారందరినీ అలర్ట్ చేయడం ద్వారా డ్రైవర్ స్థితిని తెలియజేస్తుంది. తద్వారా ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు అవకాశం కలుగుతుందనేదే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశ్యం.

జి.శివకౌశిక్, బేస్తవారిపేట
జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, 10వ తరగతి

పంటిద్వారా వినగలగడం



సమాజంలో వినికిడి లోపంతో బాధపడేవారిని అనేకమందిని చూస్తుంటాం. కొంతమంది హియరింగ్ ఎయిడ్స్ ద్వారా చెవిలోపల లేదా చెవికి బయట ఒక పరికరం అమర్చడం ద్వారా వినికిడి లోపాన్ని అధిగమించే వారిని అందులో కొంత మందిని చూస్తుంటాం. కానీ అసలు వినికిడి శక్తే లేని వారి పరిస్థితి ఏమిటి. ఈ అంశమే ఈ చిన్నారిని ఆలోచింపజేసింది. బధిర విద్యార్థులకు చదువు నేర్పడం ఎలా అనే అంశంపై విద్యార్థి దృష్టి సారించి పంటి ద్వారా వినేందుకు అవకాశం కల్పించే పరికరాన్ని రూపొందించారు. ఈ ప్రాజెక్టుపై ఇంకా పరిశోధనలు జరగాల్సి ఉన్నప్పటికీ చిన్నారి ఆలోచన అందరినీ మంత్రముగ్ధులను చేసింది. ఒక వినూత్నమైన పరిశోధనకు శ్రీకారం చుట్టడంతో ఈ ప్రాజెక్టును కూడా తదుపరి ప్రదర్శనకు ఎంపిక చేశారు.

డి.సాత్విక్ , మంగమూరు
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

నీటి నుంచి చమురును వేరుచేయడం

భారత దేశం అత్యధికంగా చమురును దిగుమతి చేసుకుంటుంది. ఇటు రష్యా నుంచి కావొచ్చు లేదా గల్ఫ్ కంట్రీస్ నుంచి కావొచ్చు. మరి...ఈ నేపథ్యంలో ఆ ఆయిల్‌ను స్టీమర్ల ద్వారా దేశానికి తీసుకువస్తారు. ప్రపంచంలో అత్యధిక దేశాల్లో ఇదే పరిస్థితి. ఈ క్రమంలో ప్రతి ఏటా 2.60 బిలియన్ లీటర్ల చమురు సముద్రంలో కలిసిపోతుందని అంచనా. తద్వారా సముద్రపు జీవుల అనేకం మృత్యువాత పడటమే కాకుండా నీటి కాలుష్యం కూడా చోటుచేసుకుంటోంది. ఈ నేపథ్యంలో ఈ చిన్నారులు సముద్రపు నీటి నుంచి చమురును వేరుచేయడం సాధ్యమే అంటూ ఆయిల్ స్కిమ్మర్ అనే ప్రాజెక్టును రూపొందించారు. చమురును నీటి నుంచి వేరుచేయడం ద్వారా సముద్రపు జీవులను రక్షించడమే కాకుండా ప్రకృతిని కూడా రక్షించడం సాధ్యపడుతుందని, భవిష్యత్ తరాలకు మంచి ప్రకృతిని అందజేయడమే తమ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశ్యం.


గ్రూప్ ప్రాజెక్టు, కె.అరుణ్‌కుమార్, ఎన్‌వీ నరసింహం, 9వ తరగతి, మేడపి జెడ్పీ ఉన్నత పాఠశాల

గిరిజన గూడేల్లో పర్యటన

- కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారుల బృందం
- ప్రధాన మంత్రి జన్‌జాతి న్యాయ మహా అభియాన్ కార్యక్రమంపై అవగాహన


మర్రిపాలెం గిరిజన గూడెంలో పర్యటించిన కేంద్ర ప్రభుత్వ అధికారులు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని గిరిజన గూడేల్లో కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారుల బృంద సభ్యులు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని మర్రిపాలెం గూడేంలో పర్యటించి గూడెంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధాన మంత్రి జన్‌జాతి న్యాయ మహా అభియాన్ కార్యక్రమంలో భాగంగా గిరిజన గూడేల్లో తాము పర్యటిస్తామన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి అవగాహన కల్పించారు. విద్య, వైద్యం, పక్కా గృహాలు మెదలైన అవసరాలను ఈ పథకం ద్వారా పొందవచ్చని తెలిపారు. ఈ పథకానికి సంబంధించిన సర్వే 2024 జనవరి 5వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు. 5వ తేదీ లోగా చెంచు గిరిజనులు వారి అవసరాలను సర్వేల్లో పొందు పర్చుకోవాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర గిరిజన సంక్షేమ అధికారి కుంజ్ బిహారి, రాష్ట్ర గిరిజన అభివృద్ధి శాఖ అధికారి హరికృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్ మదుసూధన్, డీఎల్‌డీఓ సాయికుమార్, ఐటీడీఏ అదనపు పీఓ ధనుంజయరావు, ఐటీడీఏ స్పెషల్ ఆఫీసర్ నాగేశ్వరరావు, ఏపీఓ, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆటో స్పేర్‌పార్ట్ షాపులో అగ్నిప్రమాదం



బేస్తవారిపేట: స్థానిక జంక్షన్‌లో ఆటో స్పేర్‌పార్ట్ షాపులో శుక్రవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. బోయిళ్లపల్లె శివకుమార్‌కు చెందిన స్పేర్ పార్ట్స్ దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. బయటకు వ్యాపించడంతో చుట్టుపక్కల దుకాణాల వారు సమాచారం అందించారు. శివకుమార్ షాపు వద్దకు వెళ్లి షట్టర్ తీయడంతో మంటలు పూర్తిగా వ్యాపించాయి. షాపులో ఉన్న ఆటో ఇంజిన్లు, స్పేర్ పార్ట్స్ అగ్నికి ఆహుతయ్యాయి. ఈ సంఘటనలో రూ.12 లక్షల నష్టం జరిగినట్లు దుకాణ యజమాని తెలిపాడు. కంభం అగ్నిమాపదళ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఎట్టకేలకు అదుపులోకి తెచ్చారు.

జాతీయ పోటీలకు దొనకొండ విద్యార్థిని


కేరళ జాతీయ ట్రెక్కింగ్‌లో పేర్నమిట్ట విద్యార్థులతో ఏపీ ఎన్‌సీసీ టీం

దొనకొండ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న రేపూడి స్నేహ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు కె.నరసింహారావు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారు నిర్వహించిన 67వ రాష్ట్ర స్థాయి బేస్ బాల్ క్రీడా పోటీలు గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలం వెనిగండ్ల ఉన్నత పాఠశాలలో నవంబర్ 16 నుంచి 18 వరకు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రకాశం జిల్లా బాలికల జట్టు ప్రథమ స్థానం సాధించింది. జిల్లా జట్టులో మంచి ప్రతిభ కనబరచిన స్నేహ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. జనవరి నెల 2 నుంచి 5వ తేదీ వరకు చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయపూర్‌లో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని నరసింహారావు తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం పాఠశాలకు గర్వకారణమని ప్రధానోపాధ్యాయులు వీవీ రామాంజనేయులు, ఉపాధ్యాయ సిబ్బంది స్నేహను అభినందించారు. మంచి శిక్షణ ఇచ్చిన నరసింహారావును అభినందించారు.


స్నేహను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ట్రెక్కింగ్ క్యాంప్

చీమకుర్తి: పేర్నమిట్ట జిల్లా పరిషత్ హైస్కూలుకు చెందిన ముగ్గురు విద్యార్థులు తమ ఎన్‌సీసీ ఆఫీసర్‌తో కలిసి కేరళలో నిర్వహించిన జాతీయ ట్రెక్కింగ్ క్యాంప్‌లో పాల్గొన్నారు. ఈనెల 22 నుంచి 29 వరకు నిర్వహించిన జాతీయ ట్రెక్కింగ్ క్యాంప్ పూర్తి కావడంతో శనివారం పేర్నమిట్ట స్కూలుకు రావడంతో ఆ వివరాలను ఎన్‌సీసీ ఆఫీసర్ బి.శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు. పేర్నమిట్ట జిల్లా పరిషత్ హైస్కూలు నుంచి కె.శ్రీధర్, పి.హరీష్, టి.యశ్వంత్‌తో పాటు ఎన్‌సీసీ ఆఫీసర్ బి.శ్రీనివాసరావు కూడా కేరళ జాతీయ ట్రెక్కింగ్ క్యాంప్‌లో పాల్గొన్నట్లు తెలిపారు. కేరళ రాష్ట్రంలోని ఇడుక్కి జిల్లాలో కులమావులో ట్రెక్కింగ్ క్యాంప్ నిర్వహించినట్లు తెలిపారు. ఏపీ నుంచి 100 మంది చొప్పున ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి 502 మంది ఎన్‌సీసీ విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ట్రెక్కింగ్ క్యాంప్‌ను విజయవంతంగా ముగించుకొని వచ్చిన ఎన్‌సీసీ విద్యార్థులను హైస్కూలు హెచ్‌ఎం పార్వతి శాంతి మాట్లాడుతూ ఎన్‌సీసీలో పాల్గొనటం వలన క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు అలవడతాయని విద్యార్థులతో పాటు ఎన్‌సీసీ ఆఫీసర్ శ్రీనివాసరావును అభినందించారు.